


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 17 ఆగస్టు 2021 | సంపుటి : 03 | సంచిక :13 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## 'జగనన్న విద్యా కానుక' ప్రారంభించిన సీఎం జగన్



తూర్పుగోదావరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా పి.గన్నవరం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి.. అభివృద్ధి పనులను పరిశీలించారు. తరగతి గదిలోని గ్రీన్ బోర్డుపై 'ఆల్ ద వెరీ బె?స్ట్' అని రాసి సీఎం జగన్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం హైస్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్ దృష్ట్యా స్కూళ్లు తెరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఐసీఎంఆర్, డబ్ల్యూహెచ్ కూడా స్కూళ్లు తెరవాలని సూచించారని, కోవిడ్ పాజిటివిటీ రేటు 10 శాతం కన్నా తక్కువగా ఉన్న.. గ్రామ సచివాలయాలు యూనిట్‌గా తీసుకుని స్కూళ్లను ప్రారంభించామని పేర్కొన్నారు. కోవిడ్ ప్రొటోకాల్స్ పాటిస్తూ పాఠశాలలను ప్రారంభించామని, పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు 'జగనన్న విద్యాకానుక' కింద బై లింగువల్ టెక్ట్స్‌బుక్స్, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, డిక్షనరీ ఇస్తున్నామని పేర్కొన్నారు. ? పి. గన్నవరం హైస్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ.. స్కూళ్లల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని తెలిపారు. నాడు–నేడుతో కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను రూపొందించామని పేర్కొన్నారు.

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. సీఎం జగన్ స్కూళ్ల రూపురేఖలు మార్చారని, పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేసి చూపించారని తెలిపారు. కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలు కొనసాగించామని చెప్పారు. తొలి దశలో 3,669 కోట్లతో 15,715 పాఠశాల అభివృద్ధి చేశామని, రెండో విడత నాడు నేడు పనులకు శ్రీకారం చుట్టామని ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా పి.గన్నవరం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి.. అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలోని గ్రీన్ బోర్డుపై 'ఆల్ ద వెరీ బె?స్ట్' అని రాసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి తరగతి గదిలోకి వెళ్లి సీఎం జగన్ విద్యార్థులతో మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. పాఠశాల సిబ్బంది విద్యార్థులకు అందిస్తున్న పలు సౌకర్యాలను సీఎం జగన్‌కు వివరించారు. ప్రస్తుతం స్కూల్లో ఉన్న సౌకర్యాలు ఎలా ఉన్నాయో స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకొని.. ప్రభుత్వం అందిస్తున్న స్కూల్ బ్యాగ్‌ను భుజనా వేసుకొని మరీ సీఎం జగన్ పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారానికి సంబంధించిన 'మెనూ'ను సీఎం జగన్ పరిశీలిచారు. అనంతరం 'మనబడి నాడు–నేడు' ద్వారా తొలి విడత పనులు పూర్తైన పాఠశాలలను పైలన్ ఆవిష్కరించి సీఎం జగన్ ప్రారంభించారు.

# నాడు-నేడు ద్వారా ప్రతి సర్కారు బడిలో 10 మార్పులు: సీఎం జగన్



తూర్పుగోదావరి: కార్పొరేటు పాఠశాలలకు ధీటుగా.. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనబడి నాడు–నేడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి విడత కింద రూ.3,669 కోట్లతో సర్వాంగ సుందరంగా 15,715 ప్రభుత్వ స్కూళ్లను ఆధునీకరించారు. నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా సీఎం జగన్ సోమవారం వీటిని విద్యార్థులకు అంకితం చేశారు. తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరం జెడ్పీ హైస్కూల్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి సీఎం జగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. "ఒక మంచి కార్యక్రమానికి ఈ రోజు శ్రీకారం చుట్టాం. నేడు మూడు కార్యక్రమాలు జరగనున్నాయి. మొదటిది ఈ రోజు నుంచి బడులు తెరుస్తుండగా.. మరో రెండు కార్యక్రమాలు జగనన్న విద్యా కానుక, నాడు నేడు రెండోదశ పాఠశాల పనులకు శ్రీకారం చుట్టడం. పిల్లల భవిష్యత్ దృష్ట్యా స్కూళ్లు తెరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. రెండేళ్ల నుంచి విద్యార్థులు పాఠశాలకు దూరం అయ్యారు. డబ్ల్యూహెచ్ఓ, ఐసీఎంఆర్ సూచనల మేరకు బడులు తెరిచాం. కోవిడ్ పాజిటివిటీ రేటు 10 శాతం కన్నా తక్కువగా ఉన్న.. గ్రామ సచివాలయాలు యూనిట్‌గా తీసుకుని స్కూళ్లను ప్రారంభించాం. కోవిడ్ ప్రొటోకాల్స్ పాటిస్తూ పాఠశాలలను ప్రారంభించాం. టీచర్లు అందరికి టీకాలిచ్చాం" అని తెలిపారు. "పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా నిర్ణయం తీసుకున్నాం. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు 'జగనన్న విద్యాకానుక' ఇస్తున్నాం. దీనిలో భాగంగా 47.32 లక్షల మంది విద్యార్థులకు 731.30 కోట్లతో 'జగనన్న విద్యాకానుక' ఇస్తున్నాం. విద్యాకానుకలో ఒకవైపు తెలుగు, మరో వైపు ఇంగ్లీష్ భాషల్లో ఉన్న బై లింగువల్ టెక్ట్స్‌బుక్స్, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, డిక్షనరీ ఇస్తున్నాం. ఐదో తరగతి వరకు విద్యార్థులకు అర్థమయ్యేలా బొమ్మలతో ఇంగ్లీష్ డిక్షనరీ ఇస్తున్నాం" అని తెలిపారు. "నాడు–నేడుతో తొలి దశలో 3,669 కోట్లతో 15,715 పాఠశాలల అభివృద్ధి చేశాం. నేడు రెండో విడత నాడు నేడు పనులకు శ్రీకారం చుట్టాం. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతున్నాం. నాడు–నేడు ద్వారా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 10 మార్పులు చేస్తున్నాం. వాటిలో భాగంగా స్కూళ్లలో ఫర్నిచర్, నీటివసతి, రక్షిత తాగునీరు, పెయింటింగ్స్.. గ్రీన్ చాక్ బోర్డ్, ఇంగ్లీష్ ల్యాబ్, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ప్రహరీ గోడ, వంటగది వంటి వసతులు కల్పించాం. నాడు–నేడుతో ప్రతి స్కూల్‌లో ఇంగ్లీష్ ల్యాబ్ కూడా తీసుకొచ్చాం" అని సీఎం జగన్ తెలిపారు. "నాడు–నేడుతో అంగన్‌వాడీలను అభివృద్ధి చేశాం. నాడు–నేడుతో 57వేల స్కూళ్ల రూపురేఖలు మారబోతున్నాయి. విద్యా వ్యవస్థ ఆరు విభాగాలుగామారబోతుంది. శాటిలైట్ ఫౌండేషన్ బడులుగా మారనున్న పూర్వ ప్రాథమిక విద్య 1,2 పి.పి(ప్రీప్రైమరీ)...1,2 పీపీతోపాటుఒకటి,రెండు తరగతు లుంటే ఫౌండేషన్.. ఒకటి నుంచి 5 తరగతులు ఉంటే ఫౌండేషన్ ప్లస్.. 3 నుంచి 8వ తరగతి వరకు ఉంటే ప్రీ హైస్కూళ్లు.. 3 నుంచి 10వ తరగతి వరకు ఉంటే ఉన్నత పాఠశాలలు.. 3 నుంచి 12 వరకు ఉంటే హైస్కూల్ ప్లస్‌గా మార్పు చేశాం" అని సీఎం జగన్ తెలిపారు. "ఒక్కో సబ్జెక్ట్‌కు ఒక టీచర్ ఉండే విధంగా చర్యలు తీసుకున్నాం. గత రెండేళ్లతో పోల్చితే స్కూళ్లల్లో విద్యార్థులసంఖ్యగణనీయంగాపెరిగింది. రెండేళ్లలోనే రూ.32 ,714 కోట్లు ఖర్చు చేశాం. పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి చదువే" అన్నారు సీఎం జగన్.

# రాష్ట్రవ్యాప్తంగా మోగిన బడి గంటలు



విజయవాడ సోమవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ నందు జగనన్న విద్యా కానుక పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసారు. మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి సారధ్యంలో విద్య పట్ల ఎంతో ధృఢ సంకల్పంతో ఉందని తెలిపారు. విద్యార్థులకు విద్యను అభ్యసించేందుకు పాఠశాలలో అన్ని తరహా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు మరియు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గవర్నమెంట్ పాఠశాలల ను తీర్చిదిద్దడంలో జగనన్న ప్రభుత్వం సఫలమైందని తెలిపారు. చంద్రబాబు నాయుడు హయాంలో పిల్లల వల్ల ఏమి ఉపయోగం లేదని పాఠశాలలో చదువుకునే పిల్లలకు వారి విద్యాభ్యాసం ప్రోత్సహించడం ఇలాంటి వాటిని పెడచెవిన పెట్టి విద్యార్థులకు తీరని లోటు చేసారని తెలిపారు. కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం జగన్ మోహన్ రెడ్డి సారధ్యంలో పిల్లలకు విద్యను అభ్యసించడానికి అన్ని రకముల వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు మరియు వారికి గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనం కూడా మంచి పౌష్టికహారం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చు చేయడానికి మరియు పాఠశాలలో పిల్లల భవిష్యత్తు కోసం ఏటువంటి కార్యక్రమాలు రూపొందించడానికైనా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు

## దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచింది: ఆదిమూలపు



తూర్పు గోదావరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలోని స్కూళ్ల రూపురేఖలు మార్చారని, పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేసి చూపించారని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. సోమవారం సీఎం జగన్ తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా 'జగనన్న విద్యాకానుక'ను ప్రారంభించారు. విద్యాకానుక కింద కొంతమంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. అనంతరం పి. గన్నవరం జెడ్పీహెచ్ స్కూల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సభలో మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. " కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలు కొనసాగించాం. తొలి దశలో 3,669 కోట్లతో 15,715 పాఠశాల అభివృద్ధి చేశాం. రెండో విడత నాడు నేడు పనులకు శ్రీకారం చుట్టాం. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నాం. దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచింది" అని అన్నారు.

## వాజ్‌పేయికి రాష్ట్రపతి, ప్రధాని ఘన నివాళులు

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సందర్భంగా ఆయనకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ సోమవారంనాడు ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని 'సదైవ్ అటల్' సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. వాజ్‌పేయి స్మారకం వద్ద నివాళులర్పించిన వారిలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, పలువురు బీజేపీ నేతలు ఉన్నారు. బీజేపీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన అటల్ బిహారీ వాజ్‌పేయి సుదీర్ఘ అస్వస్థతతో 93 ఏళ్ల వయస్సులో 2018 ఆగస్టు 16న ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మూడుసార్లు ప్రధానిగా పనిచేశారు. 1996 స్వల్పకాలం ప్రధానిగా కొనసాగగా, 1998, 2004లో మరో రెండుసార్లు ప్రధాని పదవిని చేపట్టారు. డిసెంబర్ 25న వచ్చే ఆయన జయంతిని 'గుడ్ గవర్నెన్స్ డే'గా జరుపుకొంటారు. 2014లో వాజ్‌పేయికి భారతరత్న పురస్కారం లభించింది.



## పరామర్శించేందుకు వెళ్లిన టిడిపి నేతలపై పోలీసుల దౌర్జన్యమా?

### హత్యకు గుర్రైన దళిత విధ్యార్థిని రమ్యకు రూ. కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలి

### సీతానగరం గ్యాంగ్ రేప్ నేరస్తుడు వెంకటరెడ్డిని పట్టుకోవండంలో జగన్ ప్రతాపం చూపించాలి

### నారా చంద్రబాబు నాయుడు

అమరావతి స్వాతంత్ర్య దినోత్సవం నాడే గుంటూరులో పోలీస్ స్టేషన్ సమీపంలో దారుణ హత్యకు గురైన దళిత విధ్యార్ధిని రమ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన టిడిపి నేతలు నక్కా ఆనంద్ బాబు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, దూళిపాళ్ల నరేంద్ర గార్లపై పోలీసుల దౌర్జన్యం మానవ హక్కుల ఉల్లంఘనకు, ప్రజాస్వామ్య విలువలకు గండికొట్టేదిగా ఉన్నదని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ప్రతాపం చూపించాల్సింది తన ఇంటి సమీపంలో గ్యాంగు రేప్ నేరస్తుడు వెంకటరెడ్డిని పట్టుకోవడంలో చూపించాలి. అలాగే రమ్య కుటుంబానికి రూ. కోటి రూపాయలు పరిహారం ఇవ్వడంలో ఔదార్యం చూపించాలని అన్నారు. అంతేగానీ పరామర్శకు వెళ్లిన లోకేష్, నక్కా ఆనంద్ బాబు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, దూళిపాళ నరేంద్ర లపై అమానుషంగా వ్యవహరించడం సరికాదు. పోలీస్ స్టేషన్ సమీపంలో రమ్య హత్యగావించబడుతుంటే దిశ యాప్ ఏం చేస్తుంది? సిసి కెమెరాలు ఏమయ్యాయి? గుంటూరునడిబొడ్డునే సిసి కెమేరాలు పనిచేయలేదంటే జగన్ రెడ్డికి మహిళల రక్షణ పై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్ధమౌతుంది.

## నిందితునికి కఠిన శిక్ష పడేలా చూస్తాం :: మంత్రి సుచరిత

గుంటూరు నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని హోం మంత్రి సుచరిత అన్నారు. సోమవారం నాడు రమ్య కుటుంబసభ్యులను పరామర్శించిన హోంమంత్రి, నిందుతుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. సీఎం ప్రకటించిన 10 లక్షల రూపాయల చెక్ ను బాధిత కుటుంబానికి అందించారు. రమ్య మృతికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. హోం మంత్రి మాట్లాడుతూ బీటెక్ విద్యార్థిని రమ్య హత్య ఘటన అత్యంత బాధాకరం. సిసి కెమెరా ఫుటేజ్ ఆధారంగానే నిన్నటి ఘటనలో నిందితుడని అరెస్ట్ చేశాం. నిందితుడిని ఒక్క రోజుల్లోనే పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగింది. రమ్య కుటుంబసభ్యులకు అన్ని విధాలుగా ప్రభుత్వం తరఫున అండగా ఉంటాం. ముఖ్యమంత్రి మహిళల భద్రత విషయంలో ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. – దిశ చట్టం ఎక్కడుంది.. అంటూ ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. రాష్ట్రంలో దిశ చట్టానికి సంబంధించి చర్యలు ప్రారంభించిన తర్వాత 58 రోజుల్లోనే మహిళలపై జరిగిన దాడులపై దర్యాప్తు పూర్తి అవుతుంది. ప్రత్యేకంగా 18 దిశ పోలీస్ స్టేషన్లలను ఏర్పాటు చేసి.. మహిళలకు రక్షణగా ప్రభుత్వం ఉంది. అదేవిధంగా తిరుపతి, విశాఖపట్నం, విజయవాడలో లో మూడు ఈూఒ ల్యాబ్ లు కూడా త్వరలోనే పూర్తి అవుతున్నాయి. ఎక్కడైనా మహిళలకు అన్యాయం జరిగితే ముఖ్యమంత్రి స్వయంగా స్పందిస్తున్నారు. మహిళపై దాడులకు పాల్పడిన ఏ ఒక్క నేరస్థుడిని ఈ ప్రభుత్వం వదిలిపెట్టలేదు. వదిలిపెట్టదు. అంతేకాకుండా, బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసి వారికి అండగా నిలబడుతున్నాము. మహిళపై అఘాయిత్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు.



## టీడీపీ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ పిరికిపంద చర్య: కొల్లు రవీంద్ర

అమరావతి: టీడీపీ నాయకులను అరెస్ట్ చేయడం ప్రభుత్వ పిరికిపంద చర్య అని మాజీ మంత్రి, తెలుగుదేశం సీనియర్ నేత కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలుగుదేశం నేతలపై పోలీసులే దౌర్జన్యం చేయడం సిగ్గుచేటన్నారు. నారా లోకేష్, నక్కా ఆనంద్‌బాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ధూళిపాళ్ల నరేంద్ర ఏం తప్పుచేశారు? అని ప్రశ్నించారు. వారిపట్ల అమానుషంగా వ్యవహరించడం దారుణమన్నారు. మహిళలపై దాడులు జరుగుతుంటే మహిళా హోంమంత్రి ఏం చేస్తున్నారు ? అని నిలదీశారు. టీడీపీ నేతలపై దాడిచేసిన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

మంగళవారం 17 ఆగస్టు 2021

## టిబెట్ పై చైనా కన్ను

చైనా అధినేత జిన్ పింగ్ మాటలకు, చేతలకు ప్రతి దానికీ ఓ లెక్క ఉంటుంది. అది ఇతరుల ఊహలకు అందనే అందదు. జులై నెలాఖరులో ఆయన టిబెట్ లో పర్యటించారు. మూడురోజుల పాటు పర్యటించి టిబెట్ రాజధాని లాసా తదితర నగరాలను, బ్రహ్మపుత్ర నది వంతెనలను ఇతర కీలక ప్రాంతాలను సందర్శించారు. మూడు దశాబ్దాల తరవాత ఒక చైనా అధినేత టిబెట్ లో పర్యటించడం ఇదే ప్రథమం. 1991లో అప్పటి అధినేత జియాంగ్ జెమిన్ తరవాత స్వయం ప్రతిపత్తి గల టిబెట్ సందర్శించిన తొలి దేశాధినేత జిన్ పింగే కావడం విశేషం. అప్పట్లో ఆయన పర్యటనను యావత్ ప్రపంచం ఆసక్తి గా గమనించింది. దీని వెనక గల కారణాలపై ఆరా తీయడం ప్రారంభించింది.తాజాగా టిబెట్ లోని ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు చొప్పున యువత సైన్యంలో చేరాలన్న ప్రభుత్వ ఆదేశంతో జిన్ పింగ్ పర్యటన లక్ష్యం ఏమిటో అందరికీ అర్థమైంది. ఊరక రారు మహానుభావులు అన్న చందాన జిన్ పింగ్ మనోగతం తెలిసిపోయింది. సైన్యంలో చేరడానికి సర్కారు కొన్ని నియమ నిబంధనలను సైతం నిర్దేశించింది. వారు కచ్చితంగా చైనా అధికారిక భాష అయిన 'మాండరిన్' నేర్చుకోవాలన్నది మొదటిది. అంతేకాక వారు కమ్యూనిస్టు పార్టీ పట్ల తప్పనిసరిగా విధేయత ప్రదర్శించాలి. చైనా ప్రభుత్వం పట్ల నిబద్ధత, విధేయత కలిగి ఉండాలి. ఇవి తప్పనిసరి నిబంధనలుగా పేర్కొన్నారు.సైన్యంలోకి జిన్ పింగ్ టిబెట్ యవతను తీసుకోవడానికి కొన్ని ప్రత్యేక కారణాలు లేకపోలేదు. టిబెట్ ప్రాంతం కొండలు, గుట్టలు, ఎత్తైన పర్వత ప్రాంతాలతో ఉంటుంది. ఇక్కడ ఎముకలు కొరికే చలి ఉంటుంది. ఇక శీతాకాలంలో పరిస్థితి గురించి చెప్పక్కర్లేదు. పూర్తిగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో బలగాలు పని చేయాల్సి ఉంటుంది. ఇటువంటి కఠిన పరిస్థితుల్లో పని చేయగల శక్తి సామర్థ్యాలు భారత బలగాలకు పుష్కలంగా ఉన్నాయి. భారత బలగాల్లోని ఇండో- టిబెట్ బోర్డర్ ఫోర్స్ (ఐటీబీపీ), స్పెషల్ ఫ్రాంటియర్ ఫోర్స్ (ఎస్ ఎఫ్ ఎఫ్)కు ఈ శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్తితుల్లో పనిచేయడంపై ఈ బలగాలకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తుంటారు.గత ఏడాది జూన్ లో రెండు దేశాల సరిహద్దుల్లోని వాస్తవాధీన రేఖ వద్ద గల్వాన్ లోయ ప్రాంతంలో జరిగిన ఘర్షణల్లో 20 మంది భారతీయ జవాన్లు అమరులైన సంగతి తెలిసిందే. అదే సమయంలో పైకి చెప్పనప్పటికీ బీజింగుకూ భారీ నష్టమే వాటిల్లింది. ముఖ్యంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పనిచేసే ప్రత్యేక బలగాలు లేకపోవడం పెద్ద లోటుగా కనపడింది. ఈ నేపథ్యంలో స్థానిక టిబెట్ యువతతో కూడిన బలగాల ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారమని జిన్ పింగ్ భావించారు. టిబెట్ యువతకు అక్కడి వాతావరణ పరిస్థితుల్లో పని చేయడం కొట్టిన పిండి. అందువల్ల ఆ ప్రాంత యువకులను సైన్యంలోకి చేర్చుకోవాలని జిన్ పింగ్ నిర్ణయించారు.టిబెట్ యువతతో కూడిన స్థానిక బలగాలు ప్రధానమైన పీఎల్ ఏ (పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ)కి సహాయకారిగా ఉంటాయి. ప్రత్యేక సందర్భాల్లో వీరి సేవలను వినియోగించుకుంటారు. 17 నుంచి 20 సంవత్సరాల మధ్య గల యువకులను సైన్యంలోకి చేర్చుకుంటారు. ఉభయ దేశాల మధ్య రమారమి 3488 కిలోమీటర్ల సరిహద్దు గల వాస్తవాధీన రేఖ (ఎల్ ఏ సీ- లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్) ని కాపాడుకునేందుకు టిబెట్ యువతతో కూడిన ప్రత్యేక దళం ఉపయోగపడుతుందన్నది జిన్ పింగ్ అంచనా, విశ్వాసం. 1950ల్లో చైనా పరమైన టిబెట్ ప్రగతికి ఇప్పటివరకు పకడ్బందీ చర్యలు చేపట్టలేదు. ఇప్పటికీ ఈ ప్రాంత ప్రజలపై అణచివేత, వివక్ష కొనసాగుతోంది. వీరిని ద్వితీయ శ్రేణి పౌరులు గానే చైనా పరిగణిస్తోంది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో శరవేగంగా అభివద్ధి పనులు చేపడుతున్న బీజింగ్ ఇప్పటికైనా టిబెట్ పై శ్రద్ధ పెడితే ఆ ప్రాంత ప్రజలు సంతోషిస్తారు. ఆ దిశగా అడుగులు ఎప్పుడు పడేను?

# సజ్జలపై గుస్సా....

గుంటూరు, ఆగస్టు 16, ( న్యూస్ పల్స్)ప్రభుత్వసలహాదారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పుడు విపక్షాలకు టార్గెట్ అయ్యారు. మంత్రులను ఆయన శాస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే దీనికి కారణం కేవలం హోం శాఖలో జరిగే పరిణామాలేనని తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ నేతలపై కేసులు పెడుతుండటం, గత ప్రభుత్వ హయాంలో అవినీతి తిరగదోడటం వెనక సజ్జల రామకృష్ణారెడ్డి ప్రమేయం ఉందన్నది విపక్షాల అనుమానం.అందుకే హోంమంత్రి దమ్మీగా మారారన్న ఆరోపణలను వారు చేస్తున్నారు. హోంమంత్రిత్వ శాఖపై సజ్జల రామకృష్ణారెడ్డి పెత్తనం చేస్తున్నారని, డీజీపీ సయితం ఆయన చెప్పినట్లే నడుచుకుంటున్నారని ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల వరసగా ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టుతో పాటు ఏబీ వెంకటేశ్వరరావుపై మరో కేసు నమోదు చేయడం వంటి అంశాలతో పాటు ధూళిపాళ్ల నరేంద్ర మొదలు అచ్చెన్నాయుడు అరెస్ట్ వరకూ సజ్జల రామకృష్ణారెడ్డి ప్రమేయం ఉందన్నది టీడీపీ ఆరోపణ.అందుకే ఇటీవల కాలంలో సజ్జల రామకృష్ణారెడ్డిని టీడీపీ టార్గెట్ చేస్తుంది. సహజంగానే సజ్జల రామకృష్ణారెడ్డి జగన్ కు కొంత సన్నిహితంగా ఉంటారు. క్షేత్రస్థాయిలో ఫీడ్ బ్యాక్ ను సజ్జల జగన్ కు చేరవేస్తుంటారు. జగన్ అనుమతి లేకుండా సజ్జల రామకృష్ణారెడ్డి ఒక్క అడుగు కూడా ముందుకు వేయరన్నది వైసీపీ నేతలు చెబుతారు. కేవలం సమాచారం చేరవేసే పనినే సజ్జల చేస్తున్నారంటారు. అయితే టీడీపీ మాత్రం షాడో హోంమంత్రిగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తుంది.సహజంగా హోంమంత్రి ఏ ప్రభుత్వంలోనైనా ఉత్సవ విగ్రహంలా ఉంటారనేది వాస్తవం.

చంద్రబాబు హయాంలోనూ నిమ్మకాయల చినరాజప్పకు తెలియకుండా బదిలీలు జరిగాయన్న ఆరోపణలొచ్చాయి. లోకేష్ చెప్పినట్లే హోంశాఖలో అన్నీ జరిగేవని అప్పట్లో కడా విమర్శలు విన్పించాయి. ఇప్పుడు కూడా అంతే కావచ్చు. హోంమంత్రి ఎవరున్నా అందులో ముఖ్యమంత్రి ఆలోచనలే అమలు జరుగుతాయన్నది కాదనలేని వాస్తవం. అది చంద్రబాబు కానీ, జగన్ కానీ ఎక్కడైనా, ఎప్పుడైనా హోంమంత్రి దమ్మీనే. ఈ విషయం తెలిసీ సజ్జల రామకృష్ణారెడ్డిని టీడీపీ టార్గెట్ చేయడం విశేషం

# చినబాబు వర్సెస్ సీనియర్లు



విజయవాడ, ఆగస్టు 16, (న్యూస్ పల్స్)డీపీలో సీనియర్ నేతలకు పెద్ద చిక్కు వచ్చిపడింది. వారి వయసు, అనుభవం అంత లేని నారా లోకేష్ టీడీపీలో పెత్తనం చేస్తున్నారు. ఆయన తనకంటూ యూత్ టీమ్ ని ఏర్పాటు చేసుకుని సీనియర్లకు గట్టి ఝలక్ ఇస్తున్నారు. ఇది పార్టీ పుట్టినప్పటి నుంచి ఉన్న పెద్ద తలకాయలు అసలు భరించలేకపోతున్నారుట. అలాగని బయటకు ఏమీ అనలేని స్థితిలో ఉన్నారు. ఎందుకంటే ఆయన చంద్రబాబు గారాల పుత్రం్త్నం. ఏమైనా అంటే బాబు గారి ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుంది. దాంతో సీనియర్లు కక్కలేక మింగలేక అన్నట్లుగా టీడీపీలో ఉన్నారు.ఇదిలా ఉంటే నారా లోకేష్ కి రాజకీయ అనుభవలేమి చాలా ఉంది. దానికి తోడు ఆయన ఎవరి మాటా వినరు అని కూడా ప్రచారంలో ఉంది. సీనియర్లను చంద్రబాబు బాగా చూసుకుంటారు. వారి మాట ఎంతవరకూ వింటారో తెలియదు కానీ ఎవరైనా ఏమైనా చెబితే చాలా జాగ్రత్తగా ఆలకిస్తారు. అది సీనియర్లకు కూడా మంచిగా ఉంటుంది. ఇక చంద్రబాబు దగ్గరనే సీనియర్లకు చనువు ఎక్కువ. పైగా వయసు రిత్యా కూడా వారు బాబుతోనే ఎక్కువగా కంఫర్ట్ గా ఉన్నట్లుగా ఫీల్ అవుతారుకానీ ఇపుడు చంద్రబాబే లోకేష్ కి కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఏ విషయం అయినా చినబాబు తోనే మాట్లాడమంటున్నారు. ఆ విధంగా తన తరువాత అతనేనని హింట్ ఇస్తున్నారు. దాంతో సీనియర్లు తెగ ఇబ్బంది పడిపోతు న్నారట. లోకేష్ దగ్గరకు వెళ్లాలంటే అపాయింట్మెంట్లు ఇతర ప్రోటోకాల్ కూడా చాలా ఉందని అంటున్నారు. దాంతో వారు చంద్రబాబును కలసినంత ఈజీగా చినబాబుతో కలవలేకపోతు న్నారు. ఈ పరిణామాలు టీడీపీలో నిశ్శబ్ద తుఫాన్ నే తలపిస్తున్నా యిట. సీనియర్లు తమ తరువాత కూడా వారసులు టీడీపీలో కొనసాగాలని కోరుకుంటున్నారు.దానికి బాబు నుంచి అయితే భరోసా ఉంది. కానీ లోకేష్ పూర్తిగా పార్టీ మీద పట్టు సాధిస్తున్న క్రమంలో తమ ఆశలు నెరవేరుతాయా ? లేదా అన్నది వారికి నిద్రలేకుండా చేస్తోందిట. ఎందుకంటే లోకేష్ పార్టీలో సీనియర్లను కాదని.. తనకంటూ ఏర్పాటు చేసుకున్న కోటరీలోనే ఇరుక్కుపోవడం సీనియర్లకు రుచించడం లేదు. దీంతో లోకేష్ వల్ల టీడీపీకి ఎంత వరకూ లాభం అన్న చర్చ కూడా వస్తోంది. అటు సీనియర్లు దూరంగా జరిగి, ఇటు జూనియర్లలో కూడా పనికి వచ్చేవారు లేకపోతే టీడీపీకి రెండు వైపులా నుంచి నష్టం వాటిల్లుతుందని కూడా అంచనా వేస్తున్నారు. మొత్తానికి లోకేష్ తీరే వేరబ్బా అన్న చర్చ అయితే టీడీపీలో ఉంది.

# రాయలసీమ రాష్ట్ర సాధన సమితి 8వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కడప ఆగస్టు 16 కడప జిల్లా రాయల సీమ రాష్ట్ర సాధన సమితి రాష్ట్ర మహిళా చీఫ్ ఇరగంరెడ్డి ప్రియదర్శిని రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపా అధ్యక్షురాలు మిట్టా నాగేశ్వరమ్మ , ఆధ్వర్యంలో మహిళా కార్యకర్తల సమక్షంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇరగంరెడ్డి ప్రియదర్శిని రెడ్డి మాట్లాడుతూ కరోనా కారణం గా కొంచం జాప్యం జరుగుతుంది. ఉద్యమం విషయం లో కానీ త్వరలో ఉద్యమాన్ని ఉధృతం చేయక తప్పదు .రాజకీయపార్టీ ల వల్ల వెనుకబడిన రాయలసీమ కు ఎలాంటి ఉపయోగం లేదు అనడానికి తరతరాల మన రాయలసీమ వెనుకుబాటే నిదర్శనం కాబట్టి ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధన తో నే సీమ కు బ్రతుకు భవిష్యత్ కాబట్టి మన నాయకులు ఇరగంరెడ్డి ఆదేశానుసారం త్వరలో పోరు బాట పట్టక తప్పదు. మహిళలు బాధ్యతగా బిడ్డలభవిష్యత్‌కోసంస్వరాష్ట్ర సాధన లో విరివిగా భాగస్వామ్యం కావాల్సినఅవసరంఉందిఅనిపిలుపునిచ్చారు. ప్రభు త్వం ఏర్పాటై రెండు సంవత్సరం లు గడిచిన రాయలసీమ ప్రయోజ నాలేవి, ప్రభుత్వం ఆలోచన చేసిన దాకలాలు లేవు. కడప ఉక్కు పరిశ్రమ, రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టు లు ఇంకా అట్లే ఉన్నాయి రైతు లు నిరుద్యోగ యువత బ్రతుకు లు ప్రశ్నర్థాకం గా మారాయి.సీమ ప్రజలు బాధ్యత గా భవిష్యత్ తరాలకోసం అయినా స్వరాష్ట్ర సాధన ఉద్యమబాట పట్టక తప్పదు అని ఆమె పిలుపు నిచ్చారు.రాష్ట్రమహిళా ఉపాఅధ్యక్షురాలు నాగేశ్వరమ్మ మాట్లాడుతూ... నాయకులు ఓట్ల నాడు మాత్రమే ప్రజల ముందు కు వస్తారు సీట్లు ఎక్కాక ప్రజల మాటే ఎత్తడం లేదు. ముఖ్యం గా రాయలసీమ విషయం లో నాయకులు నోరే విప్పరు అసంబ్లీ ల లో రాయలసీమ అవసరాలు కోసం ప్రయోజనాలు కోసం. కేవలం స్వార్థం తో రాజకీయనాయకులేరాయలసీమగొంతు కోస్తా వున్నారు. తరతరాలు గా...కాబట్టి ఇక ఇప్పుడు సీమ బిడ్డ లు ముఖ్యం గా మహిళా లు బాధ్యత గా భవిష్యత్ తరాల బ్రతుకు కోసం ఖచ్చితంగా రోడ్లు ఎక్కాలి. ఇక స్వేచ్ఛ కోసం స్వాతంత్రనీ కోసం రాయలసీమ ఆస్థిత్వనీ కోసంఅనిపిలుపునిచ్చారు.

# పల్లా... దారెటు



విశాఖపట్టణం, ఆగస్టు 16, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీని విశాఖ జిల్లాలో నడిపించే నాధుడు లేకుండా పోయాడు అన్న బాధ కార్యకర్తలది. విశాఖ అంటే ఒకనాడు టీడీపీకి కంచుకోట లాంటిది. 2019 ఎన్నికల్లో వైసీపీ గాలి రాష్ట్రం మొత్తం వీచింది. ఇక విశాఖ రూరల్ సహా ఏజెన్సీ మొత్తం వైసీపీ ఏకపక్షంగా విజయాలను దక్కించుకున్నా కూడా సిటీలో మాత్రం ఎంటర్ కానీయకుండా కాపు కాచిన ఘనత క్యాడర్ దే. విశాఖలోని నాలుగు దిక్కులా టీడీపీ ఎమ్మెల్యేలే గెలిచారు. అయితే రెండేళ్లలో సీన్ మొత్తం మారిపోయింది. ఇక సిటీకి అన్నీ తానే వ్యవహరించి టీడీపీ బాధ్యతలు సమర్ధంగా చూసే విశాఖ సౌత్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తప్పుకున్నారు. ఆయన వైసీపీలోకి వెళ్ళి ఇప్పటికి ఫుల్ హ్యాపీగా ఉన్నారు.దాంతో గాజువాకలో ఓడిన పల్లా శ్రీనివాసరావుని తెచ్చి పార్టీ ప్రెసిడెంట్ గా చేశారు చంద్రబాబు. ఆయన ఎంపిక మీదనే టీడీపీలో అసంతృప్తి ఉంది. విశాఖ వైసీపీలో యాదవ సామాజిక వర్గాన్ని టార్గెట్‌గా చేసుకుని పదవులు ఇస్తోంది. కీలక పదవుల్లో యాదవ వర్గాన్ని కూర్చోపెడుతోంది. ఈ క్రమంలోనే టీడీపీ పదవుల్లోనూ యాదవులకు ప్రయార్టీ ఇస్తామని చెప్పుకునేందుకే ఆ వర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావుకు ఈ పదవి కట్టబెట్టారు. అయితే ఆయన బలమైన విశాఖ టీడీపీ నేతలను ఎంత వరకు నడిపిస్తారో ? ఆ పార్టీ నేతలకే నమ్మకం లేదు. ఓడిన వారి కంటే గెలిచిన ఎమ్మెల్యేలలో ఒకరికి పదవి ఇవ్వవచ్చు కదా అన్న చర్చ కూడా అప్పట్లో నడిచింది.ఇక సిటీలో టీడీపీ ఆఫీస్ ఉంటే పల్లా శ్రీనివాసరావు పెద్దగా వచ్చిన దాఖలాలు లేవు. దాంతో సిటీ నడిబొడ్డున వందల కోట్లతో నిర్మించిన పార్టీ ఆఫీస్ వెలవెలబోతోం ది. గతంలో వాసుపల్లి ఉన్నపుడు ప్రతీ రోజూ పార్టీ ఆఫీస్ కి వచ్చేవారు. కార్యకర్తలతో ముచ్చటించేవారు. మంచీ చెడ్డా చూసేవారు. మరో మాజీ ఎమ్మెల్యే రెహ్మాన్ సైతం నగర పార్టీ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు పార్టీని తన వంతుగా ముందుకు నడిపించే వారు. అయితే ఇప్పుడు పల్లా శ్రీనివాసరావు మాత్రం ఆ ఇద్దరితో పోలిస్తే జీరో స్థాయి పెర్ఫామెన్స్ చేస్తున్నారన్న విమర్శలు సొంత పార్టీ నేతల్లోనే వినిపిస్తున్నాయి. వాసుపల్లి, రెహ్మాన్ అయితే అధికార పార్టీకి వ్యతిరేకంగా నెలలో కనీసం మూడు నాలుగు నిరసన కార్యక్రమాలు కూడా నిర్వహించేవారు.పల్లా శ్రీనివాసరావు మాత్రం గాజువాక దాటి అసలు కదలరు అన్న విమర్శలు ఉన్నాయి. అంతే కాదు ఉద్యమాలు లేవు, నిరసనలు అన్న ఊసు లేదు. మరో వైపు చూస్తే విశాఖ సిటీలో పార్టీకి సరైన డైరెక్షన్ ఇచ్చే వారు కూడా కనిపించడంలేదు. విశాఖలో ఉన్న పార్టీ నాయకులు గాజువాక వెళ్ళి ఆయన్ని కలసిరావడం అంటే అది కష్టమైన వ్యవహారమే. మరో వైపు ఆర్ధికంగా కూడా పార్టీని ఆదుకునే సీన్ కూడా లేదు. దీంతో పల్లా శ్రీనివాసరావు నాయకత్వంలో టీడీపీ విశాఖలో ఏమైనా ఎదుగుతోందా, లేక ఇంకా తగ్గిపోతోందా అన్న చర్చ అయితే సొంత పార్టీలో ఉంది మరి. చూడాలి హై కమాండ్ దీని మీద ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో మరి

## ఏపీలో నియంత పాలన కొనసాగుతోంది మావోయిస్టులు

గుంటూరు ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ పై మావోలు ఘాటైన వ్యాఖ్యలు చేసారు. కనీస సామాజిక అవగాహన, చారిత్రక వాస్తవాలు చూడలేని గౌతమ్ సవాంగ్ ను డీజీపీగా నియమించడం దౌర్భాగ్యం. సవాంగ్ ను డీజీపీగా కంటే వైసీపీ కార్యకర్తగా చేర్చుకుంటే మేలని ఏవోబీ ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ అన్నారు. ఏఓబీలో మావోయిస్టులు ఉనికి కోల్పోతున్నరన్న గౌతమ్ సవాంగ్ వ్యాఖ్యలను మావోలు ఖండించారు. నిజంగా ప్రజలకు సమస్యలే లేనప్పుడు ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీలే ఎందుకు బహిష్కరించారని అయన ప్రశ్నించారు. మావోయిస్టుల ఉనికే లేనప్పుడు వేలాది బలగాలను మన్యంలోకి ఎందుకు పంపి కూంబింగ్ చేస్తున్నారు. పెద్ద ఎత్తున క్యాంపులు పెట్టి ఎందుకు అక్రమ అరెస్టులు, ప్రజలపై దాడులు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. ఏఓబీలో ఉద్యమం బలహీనపడిన మాట వాస్తమే. కానీ తాము మళ్ళీ పుంజుకుని గెలిచి తీరుతామని అన్నారు. స్టీల్ ప్లాంటు ఉద్యమానికి తాము మద్దతు ఇస్తేనే డీజీపీ ఉలిక్కిపడుతున్నారు. తమ పార్టీ కేవలం మద్దతుతోనే ఆగదు, విజయం సాధించే దిశగా నాయకత్వం అందిస్తుంది. ఏపీలో అంగన్వాడీలు, ప్రాథమిక పాఠశాలల విలీనం, నూతన విద్యావిధానం వంటి ప్రజావ్యతిరేక విధానాల వల్ల లక్షలాది మంది నిరుద్యోగులవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతం కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పరస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. మన్యంలో విలువైన సంపద, బాక్సైట్ తరలింపుపై ఆదివాసీలు, ప్రజలు పోరాడుతున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. మీడియా, ప్రతిపక్షం, ప్రజాసంఘాలకు కనీస భావప్రకటనా స్వేచ్ఛ లేకుండా లేదు. ఏపీలో అత్యంత క్రూరమైన నిర్భందాన్ని అమలు చేస్తూ నియంత పాలన కొనసాగిస్తున్నారు. లొంగిపోయిన మావోయిస్టు సుదీర్ నైతికంగా పతనమై మరో సభ్యురాలైన మహితను తీసుకొని పారిపోయాడని గణేశ్ అన్నారు.

## అక్కడక్కడ తేలికపాటిభారీ వర్ష సూచన

అమరావతి ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఇప్పుడు దక్షిణ ఒడిశా తీరం వరకు విస్తరించింది. సముద్రమట్టానికి 3.1 కిమీ ఉ 7.6 కిమీ మధ్య నైరుతి దిశగా వంగి ఉంది. ఈరోజు ఉత్తర కోస్తా ఆంధ్రాలో ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. ఒకటి లేక రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. రేపు, ఉత్తర కోస్తా ఆంధ్రాలో ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉంటుంది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. పెనుగాలులు ఉత్తర కోస్తా తీరం వెంబడి వీచే అవకాశం ఉంటుంది. ఎల్లుండి ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉంటుంది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. పెనుగాలులు 40 కిమీ నుంచి 50 కిమీ వరకు గరిష్టంగా 60 కిమీ వరకు ఉత్తర కోస్తా తీరం వెంబడి వీచే అవకాశం ఉంటుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## సముద్రంలో గల్లంతయిన బాలుడు

విశాఖపట్నం విశాఖపట్టణం పూడిమడక సీతాపాలెం బీచ్లో హృదయవిధారక ఘటన జరిగింది. సొంత అన్నయ్య ముందే తమ్ముడు గల్లంతయ్యాడు. అలల ధాటికి తమ్ముడు మునిగిపోతుండటం చూసిన అన్నయ్య తల్లడిల్లిపోయాడు. విశాఖపట్నం దుప్పురు గ్రామానికి చెందిన శ్యామ్ అనే 16 ఏళ్ల బాలుడు, అతడి అన్నయ్య ఇద్దరు కలిసి విశాఖపట్నం సీతాపాలెం బీచ్ చూడటానికి వచ్చారు. అయితే అలల దాటికి శ్యామ్ సముద్రం లో గల్లంతయ్యాడు. అన్నయ్య రక్షించడానికి ప్రయత్నించినా కుదరలేదు. కళ్ళముందే తమ్ముడు కేకేలు వేస్తూ సముద్రంలో మునిగిపోయాడు. ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న అన్నయ్య తమ్ముడిని చూసి బోరున విలపించాడు. గగ్గోలు పెడుతూ చుట్టూ ప్రక్కల ఉన్న గ్రామస్తులకు విషయం తెలిపాడు. స్పందించిన గ్రామస్తులు బాలుడి కోసం సముద్రంలో గాలించినా ప్రయోజనం లేకపోయింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సముద్రం వద్దకువచ్చిదుఃఖంతోమునిగిపోయారు. చేతికందిన కొడుకు సము ద్రంలో మునిగిపోవడం చూసి భరించలేక విలపించారు. కుటుంబ సభ్యుల రోదనలు అందరిని కంటతడి పెట్టించాయి. కాగా యువకుడి కోసం గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

## నాగబాబు ఎక్కడ...

ఏలూరు, ఆగస్టు 16, (న్యూస్ పల్స్) సినిమా వాళ్లు సినిమా వాళ్లే. రాజకీయ నేతలు రాజకీయ నేతలే. ఇది అనేక ఏళ్లుగా చూస్తూనే ఉన్నాం. పార్ట్ టైం పాలిటిక్స్ కే సినిమా వాళ్లు ప్రిఫర్ చేస్తారు. అందుకే ఇప్పుడు సినిమా వాళ్లకు పాలిటిక్స్ లో పెద్దగా ప్రాధాన్యత లేకుండా పోయింది. ప్రజలు కూడా వారిని ఆదరించడం లేదు. సొంత పార్టీ అయినా వారికి పెద్దగా పట్టదు. నాగబాబు విషయాన్నే తీసుకుంటే గత రెండేళ్ల నుంచి ఆయన జనసేన కార్యక్రమాల్లో పెద్దగా పాల్గొనింది లేదనే చెప్పాలి.పవన్ కల్యాణ్ జనసేన పార్టీని స్థాపించి ఏపీ ఎన్నికలలో పోరాడేందుకు సిద్ధమయ్యారు. అన్నగా అండా ఉంటానని నాగబాబు మెగా ఫ్యామిలీ నుంచి ముందుకు వచ్చారు. పార్టీ లో చురుగ్గా పాల్గొన్నారు. ఇది చూసిన పవన్ కల్యాణ్ నాగబాబుకు నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చారు. సొంత ప్రాంతం కావడం, మెగా ఫ్యామిలీ కావడంతో గెలుపు పెద్ద కష్టమేమీ కాదని భావించారు. కానీ అక్కడ ఓటమి పాలయినా మంచి ఫలితాలనే సాధించారు.రెండోస్థానంలో నిలిచిన నాగబాబు మరోసారి నరసాపురం వైపు చూస్తే ఒట్టు. ఎవరైనా ఒకసారి ఓటమి పాలయితే మరోసారి అక్కడ విజయం దక్కించుకునేందుకు గట్టిగా ప్రయత్నిస్తారు. అనేక సార్లు ఓటమి పాలయి చివరకు అదే నియోజకవర్గంలో గెలిచిన వారు కూడా ఉన్నారు.కానీనాగబాబుకుమరసారినరసాపురం పార్లమెంటు నియోజక వర్గంలో పోటీ చేసే ఆలోచన లేనట్లుంది. అందుకే ఎన్నికల తర్వాత ఆవైపు వెళ్లలేదు.పార్టీ కార్యక్రమాలకు కూడా నాగబాబు దూరంగా ఉంటున్నారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సినిమాల్లో బిజీగా ఉన్నప్పుడు పార్టీ బాధ్యతలను నాగబాబు తీసుకుంటే బాగుంటుదని జనసేన కార్యకర్తలు సూచిస్తున్నారు. కానీ నాగబాబు మాత్రం రాజకీయాలంటే తనకు పడనట్లే వ్యవహరిస్తున్నారు. తమ్ముడి పార్టీని కూడా కాపాడాలన్న స్పృహ లేకపోతే ఎలా అని మెగా ఫ్యాన్స్ నుంచే ప్రశ్నలు వస్తున్నాయి. మొత్తం మీద నాగబాబు పార్టీలో ఉన్నారా? లేదా? అన్న సందేహం కూడా తలెత్తుతోంది.



# ఎక్కు గుమ్మం..దిగే గుమ్మంలో ఆర్థిక మంత్రి

విజయవాడ, ఆగస్టు 16, (న్యూస్ పల్స్) ఆర్థిక మంత్రిని చూశారు, రేవిన్యూ మంత్రిని కూడా చూశారు. ఆ శాఖల పేర్లు చూస్తే చాలు వారేమి పనిచేస్తారో చెబుతాయి. కానీ అప్పుల శాఖ మంత్రిట. అదేంటి దేశాన ఇలాంటి శాఖ ఒకటి ఉంటుందా అంటే ఉంది అంటున్నాయి విపక్షాలు. ఏపీలో ఆ శాఖను చూస్తున్న వారే బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి. జగన్ ఈ శాఖను ఎవరికీ ఇవ్వలేదు కదా అంటే అవును ఆయన నిజానికి మంచి శాఖనే ఇచ్చారు. అది చివరకు అలా తయారైందిట. మామూలుగా ఆలోచిస్తే ఆర్థిక మంత్రి కడు బలవంతుడు కూడా. రాష్ట్రాలలో చూసుకుంటే ముఖ్యమంత్రి తరువాత స్థానంలో ఉంటారు. కానీ అదేంటి ఖర్మమో కానీ కనీసం మంత్రిగా కూడా బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి ఆనందాన్ని హోదాని అసలు అనుభవించలేకపోతున్నారుట. ఆయన శాఖ పూర్తిగా అప్పులతో నిండిపోయింది. దాంతో ఆయన కూడా అప్పుల మంత్రిగానే ఉంటున్నారు అని ప్రతిపక్షాలు ఎకసెక్కమాడుతున్నాయి.ఢిల్లీకి ఎంపీలు పార్లమెంట్ సమావేశాలు జరిగితే వస్తారు. పనుంటే ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన పెట్టుకుంటారు. కానీ బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి కి మాత్రం హస్తిన ఆయాసం తప్పడంలేదుట. మరీ ముఖ్యంగా గత ఏడాదిన్నరగా ఆ టూర్లు బాగా ఎక్కువయ్యాయట. బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి అదే పనిగా ఏపీ టూ ఢిల్లీ అంటూ చక్కర్లు కొడుతున్నారుట. ఆయన ప్రతీ వారం ఢిల్లీలో కనిపిస్తారట. అదేంటి ఆయన ఉంటే తన సొంత జిల్లా కర్నూల్ లో ఉండాలి. లేకపోతే అమరావతి సచివాలయంలో ఉండాలి కదా. అది మామూలు ఆర్థిక మంత్రులకు, కానీ బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డిది భారమైన ఏపీ ఆర్థికాన్ని



మోసే బాధ్యత. అందువల్ల ఆయన ప్రతీ మంగళవారం ఢిల్లీకి వెళ్ళి బాండ్ల వేలం లో పాలుపంచుకుంటారుట. ఏపీకి వారానికి వేయి కోట్ల వంతున అప్పులు తెచ్చే బాధ్యతను ఆయన స్వీకరించారుట.ఇక బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి పని ఎలా తయారైంది అంటే ఢిల్లీలో ఎక్కే గుమ్మం దిగే గుమ్మంగా మారిందట. ఆయన కలసినన్ని సార్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ని బీజేపీ మంత్రులు కూడా కలవలేదుట. ఆమెను కలసి విన్నపాలు చేసుకోవడమే బుగ్గన పనిగా మారింది. అంతే కాదు, ఏపీకి ఏ ఏ శాఖల వద్ద ఎన్నెన్ని నిధులు రావాల్సి ఉన్నాయో పెద్ద లిస్ట్ పట్టుకుని అయా కేంద్ర మంత్రుల వద్దకు పరుగులు పెట్టడమే బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి మెయిన్ డ్యూటీ అయిపోయిందిట. ఇక అప్పులు ఎక్కడైనా కొత్తగా దొరుకుతాయా అన్నది కూడా చూసే బాధ్యత ఆయనదేనట.బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి కొంతకాలంగా ఎవరికీ కనబడడంలేదు, మీడియాకు దూరం అంటే ఆయన ఏమైనా అలిగారేమో అనుకున్నారు. కానీ ఆయన మాత్రం అప్పులు కొత్తగా సంపాదించడం ఎలా అన్న సబ్జెక్టు మీద బాగా స్టడీ చేస్తున్నారని తెలుసుకుని అంతా షాక్ తింటున్నారు. ఇక బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి ఇంతకాలం సీక్రెట్ గా చేసుకువస్తున్నా ఏపీలో ముదిరిన రాజకీయం మూలంగా వైసీపీ మీద బురద జల్లేందుకు విపక్షాలు బుగ్గనను అస్త్రంగా వాడుకుంటున్నాయి. ఈ క్రమంలో ఆయన్ని అప్పుల మంత్రిని చేసేశారు. దాంతో బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి మనసు పూర్తిగా విరిగిపోయిందట. అసలే ఆర్థిక శాఖ మంత్రిగా రెండేళ్ళుగా కిందా మీదా పడుతూంటే ఇపుడు అప్పుల మంత్రి అంటూ పరువు తీస్తున్నారు అంటూ ఆయన గుస్సా అవుతున్నారుట. మొత్తానికి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి ఈ రకమైన శాఖను నిర్వహిస్తాను అని కలలో కూడా అసలు అనుకోరు అని ఆయన ప్రత్యర్థులు కూడా బాధపడే స్థితి వచ్చింది మరి.

## తిరుచానూరు ఆలయంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా



తిరుపతి: లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. ఆయనకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, డాక్టర్ గురుమూర్తి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా తిరుచానూరు పద్మావతి ఆలయానికి చేరుకున్నారు. స్పీకర్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆహ్వానం పలికారు.

## పరామర్శకు వెళ్తే అరెస్టులు చేస్తారా?: టీడీపీ నేతలు

అమరావతి: ఉన్మాది చేతిలో హత్యకు గురైన రమ్య కుటుంబసభ్యుల పరామర్శ సందర్భంగా గుంటూరులో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రమ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన టీడీపీ నేతల అరెస్టులను ఆ పార్టీ నేతలు ఖండించారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ పరామర్శకు వెళ్తే అరెస్టులు చేస్తారా? అంటూ మండిపడ్డారు. ఇప్పటి వరకు సీఎం జగన్ రమ్య కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. మహిళా హోంమంత్రి సొంత జిల్లాలోనే ఇంత దారుణం జరిగిందంటే.. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయెూ అర్థమవుతోందన్నారు.బోండా ఉమ మాట్లాడుతూ నారా లోకేష్, టీడీపీ నేతల అక్రమ అరెస్టులు ప్రభుత్వ పిరికిపంద చర్యగా అభివర్ణించారు. రమ్య హత్యకు ప్రభుత్వం చేతకానితనమే కారణమన్నారు. టీడీపీ నేతలపై ఓవరాక్షన్ చేసిన గుంటూరు ఎస్పీపై చర్యలు తీసుకోవాలని బోండా ఉమ డిమాండ్ చేశారు.చినరాజప్ప మాట్లాడుతూ టీడీపీ నేతల అక్రమ అరెస్ట్ అనైతికమన్నారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. అసలు రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. జగన్ పాలనలో అరాచకం.. వికృత రూపం దాల్చిందని చినరాజప్ప మండిపడ్డారు.సోమిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతల అరెస్ట్.. రాష్ట్రంలోని అరాచక పాలనకు నిదర్శనమన్నారు. నక్కా ఆనందబాబుపై రూరల్ ఎస్పీ చేయి చేసుకోవడం దుర్మార్గమన్నారు.కళా వెంకట్రావు మాట్లాడుతూ లోకేష్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దళిత యువతిని అతికిరాతకంగా చంపితే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తే అరెస్ట్ చేస్తారా? అంటూ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం విచక్షణ కోల్పోయిందని కళా వెంకట్రావు అన్నారు.

# అటు...పరవళ్లు.. ఇటు దుర్భిక్షం

కర్నూలు, ఆగస్టు 16, (న్యూస్ పల్స్) తుంగభద్ర డ్యాంలో నీరు నిండుగా ఉన్నా..ఈ ప్రాంతాన్ని దుర్భిక్షం వీడడం లేదు. ప్రభుత్వంలో నూ చలనం రావడం లేదు. జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ కింద 1.4 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. డ్యాంలో పూడిక, ఆవిరి పేరుతో యేటా నీటి వాటాను తగ్గిస్తూ తుంగభద్ర బోర్డు అధికారులు ఆయకట్టు రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. ఫలితంగా 40 వేల ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీరందుతోంది. ఎగువన కర్ణాటక రాష్ట్రంలో మాత్రం ఆయకట్టు కంటే ఎక్కువగా సాగవుతోంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రాయలసీమలోని కరువు రావడంతో ఎంతో మంది పోరాటాలు చేసి తుంగభద్ర డ్యాం సాధించుకున్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు తరువాత కర్ణాటక పరిధిలోకి ఆ డ్యాం వెళ్లింది. ఆ తరువాత కొనేళ్ల పాటు సాగు, తాగు నీరు సమృద్ధిగానే అందింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయం. 212 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్టు నేడు 100 టీఎంసీలకు సామర్థ్యం తగ్గింది. ఈ డ్యాంలో ఎల్లెల్సీ( కర్ణాటక, ఏపీ)కి 43 టీఎంసీల నీటిని కేటాయించారు. దిగువ కాలువ 1800 క్యుసెక్కుల ప్రవాహ సామర్థ్య ఉంది. మొత్తం 348.2 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. ఇందులో డ్యాం నుంచి 131.5 కి.మీ వరకు కర్ణాటక పరిధిలోను, 131.5 కి.మీ నుంచి 148.0 కి.మీ వరకు ఏపీలోను, 148.0 కి.మీ నుంచి 156.0 కి.మీ వరకు కర్ణాటక, 156.0 కి.మీ నుంచి 188.0 కి.మీ ఏపీలో, 188.0 కి.మీ నుంచి 190.8 కి.మీ వరకు కర్ణాటక, 190.8 కి.మీ నుంచి 250.580 కి.మీ వరకు ఏపీ పరిధిలోనిప్రవహిస్తోంది. ఏపీ పరిధిలో ప్రవహించే ఈ కాలువ 250.58 కి.మీ వరకు టీబీ బోర్డు పరిధిలో ఉందిఅయితే కొన్నేళ్లుగా.. కర్ణాటక రాష్ట్రంలో ప్రవహించే ఎల్లెల్సీ, టీబీ బోర్డు పరిధిలోని కాలువకు ఇరువైపులా ఉన్న వారు అడ్డగోలుగా నీటిని చౌర్యం చేస్తున్నారు. కొందరు ఇంజినీర్ల అక్రమార్జన తోడు కావడంతో పాటు వచ్చిన సొమ్ములో టీడీపీ ప్రజాప్రతినిధులకు వాటాలుగా ఇస్తుండడంతో జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువకు కేటాయించిన నీరు రావడం లేదు. ప్రతి ఏటా జల చౌర్యాన్ని అడ్డుకుంటామని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెబుతన్నా.. ఏ ఒక్కటీ ఆచరణకు నోచుకోలేదు అక్రమ ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందుతున్నాయి. కొందరు బోర్డు అధికారులు రైతుల వద్ద మామూళ్లు తీసుకొని జల చౌర్యాన్ని ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు ఉన్నారు. అధికారులు వసూలు చేసే మామూళ్లలో కొంత మొత్తం అధికార పార్టీ ప్రజాప్రతినిధులకూ వెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 250.58 కి.మీ దగ్గక ప్రధాన కాలువలో 725 క్యుసెక్కుల నీటి ప్రవాహాన్ని చూపించాల్సిన బాధ్యత బోర్డుపై ఉంది. అయితే బోర్డు పరిధిలోని కాలువ సైట్లో 14 మంది ఇంజినీర్లు పని చేస్తున్నారు. వీరంతా ఏపీకి చెందిన వారే. 30 కి.మీ నుంచి 156.0 కి.మీ వరకు అధికంగా నానాయకట్టు సాగవుతోంది. మిగతా కాల్వ పరిధిలో కొంత తక్కువగానే సాగవుతోంది. ఈ ఏడాది ఎల్లెల్సీకి 17 టీఎంసీల నీటిని కేటాయించారు. గత నెల 18వ తేదీ నుంచి నీటిని విడుదల చేస్తున్నా ఇంత వరకు ఏపీ సరిహద్దులో 250 క్యుసెక్కుల నీటి ప్రవాహం కూడా లేదు. ఎమ్మిగనూరు తరువాత వచ్చే కాలువలోని నీటి ప్రవాహం డిస్ట్రిబ్యూటరీలకు కూడా అందడం లేదని ఇంజినీర్లే చెబుతున్నారు. జిల్లాలో వర్షాలు లేకపోవడంతో ఎండుతున్న పంటలకైన ఎల్లెల్సీ నీరు వస్తుందనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. కర్ణాటక పరిధిలోని కాలువ కింద 37,518 హెక్టార్లు స్థిరికరించిన ఆయకట్టు ఉంది. అయితే ఇంతకు రెండింతలు అక్రమ ఆయకట్టు ఉంది. ఖరీఫ్‌లోని ఆయకట్టుకు ఎకరానికి రూ.300నుంచి రూ. 500 వరకు, నానాయకట్టుకు రూ.500నుంచి రూ. 1000 చొప్పున కొందరు ఇంజినీర్లు రైతుల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రకారం ఒక్క ఖరీఫ్‌లోనే రైతుల నుంచి రూ.5కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# నిండుకుండలా గోదావరి



## పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

విజయవాడ, ఆగస్టు 16, (న్యూస్ పల్స్) గోదావరి, కృష్ణా నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ధవళేశ్వరం వరకూ గోదావరి నిండుకుండలా ప్రవహిస్తుంటే.. పులిచింతల ప్రాజెక్టు దిగువ నుంచి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 4,35,061 క్యూసెక్కుల గోదావరి వరద నీళ్లు సముద్రంలోకి వదులుతుండగా.. ప్రకాశం బ్యారేజీ నుంచి 45 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తోండటంతో కడెం, ర్యాలీ, గొల్లవాగులు, ప్రాణహిత, ఇంద్రా వతి, శబరి, తాలిపేరు, కిన్నెరసాని, సీలేరు వంటి ఉపనదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో గోదావరికి వరద పోటెత్తింది. తెలంగాణలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండిపోవడంతో వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, కిన్నెరసాని, తాలిపేరు నదుల నుంచి వరద భారీగా వస్తుండటంతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. మరోవైపు.. ఉపనదులు పొంగిపొర్లుతుండటంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్దకు సోమవారం 4,42,661 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. ఇందులో 7,600 క్యూసెక్కులు డెల్టా కాలువలకు విడుదల చేసి.. మిగతా 4,35,061 క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు. దాంతో ఈ సీజన్‌లో ఇప్పటివరకూ.. 681.015 టీఎంసీల గోదావరి జలాలు కడలిపాలయ్యాయి.కృష్ణా నదిలో ఎగువన వరద ప్రవాహం నిలకడగా ఉంది. ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లోకి వచ్చిన వరదను కాలువలకు విడుదల చేసి, మిగులుగా ఉన్న జలాలను విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 25,636 క్యూసెక్కులు రాగా కాలువలు, బీమా, కోయిల్‌సాగర్, బీమా ఎత్తిపోతలు.. విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 28,240 క్యూసెక్కులు వదులుతున్నారు. తుంగభద్రలో వరద తగ్గుముఖం పట్టింది. తుంగభద్ర జలాశయంలోకి 56,893 క్యూసెక్కులు రాగా.. 66,721 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ జలాలు సుంకేసుల బ్యారేజీ మీదుగా కృష్ణా నదలోకి చేరుతున్నాయి. జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి విడుదల చేసిన వరద జలాల్లో శ్రీశైలం జలాశయంలోకి 63,369 క్యూసెక్కులు చేరుతుండగా.. పోతిరెడ్డిపాడు, హంద్రీ?నీవా, కల్వకుర్తి ఎత్తిపోతలకు, విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా నాగార్జునసాగర్‌కు 45,790 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో 870.9 అడుగుల్లో 145.50 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. నాగార్జునసాగర్‌లోకి 23,485 క్యూసెక్కులు వస్తుండగా.. కుడి కాలువ, ఏమ్మార్పీల ద్వారా 3,944 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో 521.2 అడుగుల్లో 151.47 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. గుంటూరు, కృష్ణా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు మున్నేరు, వైరా, కట్టలేరు వాగులు పొంగిపొర్లుతున్నాయి. దాంతో పులిచింతలకు దిగువన కృష్ణా నది పరవళ్లు తొక్కుతోంది. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రకాశం బ్యారేజీలోకి 51,168 క్యూసెక్కులు చేరుతుండగా.. కాలువలకు 10,618 క్యూసెక్కులు విడుదల చేసి మిగిలినవి దిగువకు వదిలారు. దాంతో ఈ సీజన్‌లో ఇప్పటివరకూ 3.246 టీఎంసీల కృష్ణా జలాలను ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదల చేసినట్లయింది. అలాగే, వంశధార నదిలో వరద ఉధృతి పెరిగింది. గొట్టా బ్యారేజీలోకి 9,866 క్యూసెక్కులు వస్తుండగా.. 7,220 క్యూసెక్కులను కడలిలోకి వదిలారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకూ 22.76 టీఎంసీల వంశధార జలాలు సముద్రం పాలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో పోలవరం మండలం కొత్తూరు గ్రామం వద్ద లోలెవల్ కాజ్‌వేలో మూడడుగులు వరదనీరు ప్రవహిస్తోంది. ఈ కారణంగా ఏజెన్సీలోని 19 గ్రామాలకు రాకపోకలు సోమవారం నిలిచిపోయాయి. పలు కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ సీజన్‌లో గరిష్టంగా 5,92,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వరద సోమవారం రికార్డయ్యింది. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు భారీగా వస్తుండంతో ధవళేశ్వరం ఆనకట్ట వద్ద 175 గేట్లను ఎత్తివేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. గోదావరి జిల్లాలోని మూడు డెల్టాలకు 7,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.నర్సాపురంలో 400 ఎకరాలు, పెనుమంట్ర మండలంలో 500 ఎకరాలు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. కాగా, తూర్పు గోదావరి జిల్లా వీఆర్‌పురం మండలాన్ని ఆనుకొని ప్రవహిస్తున్న శబరి నదికి ఎగపోటు తగిలింది. ఇది మరింత పెరిగితే వీఆర్ పురం, కూనవరం మండలాల్లోని 30కి పైగా గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉంది.

# మీరు పిల్లలను బడికి పంపండి

**చదివించే బాధ్యత మాది**

**రెండేళ్లుగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు**

**పోటీతత్వాన్ని ఎదుర్కొనేలా విద్యార్థుల్ని తీర్చిదిద్దుతాం**

**మనబడి నాడు?నేడుతో మారిన స్కూళ్ల రూపురేఖలు**

**నూతన విద్యావిధానంతో ఆరు రకాల స్కూల్స్**

**ప్రతి ఒక్కరూ పిల్లలను బాగా చదివించండి**

అనంతపురం, ఆగస్టు 16“తల్లిదండ్రులు మీ పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువు ఒక్కటే. మీరు బడికి పంపండి. చదివించే బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని మా ప్రభుత్వం తీసుకుంటుంది. రెండేళ్లుగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చాం. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన సాగుతుంది. ఉపాధ్యాయులు కూడా పోటీతత్వాన్ని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి” అని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి తెలిపారు. నగరంలోని శ్రీకృష్ణదేవరాయ నగర పాలక ఉన్నత పాఠశాలలో సోమవారం మనబడి నాడు?నేడు మొదటి విడత పనులను జాతికి అంకితం చేయడంతో పాటు విద్యార్థులకు విద్యాకానుక కింద కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకున్నారన్నారు. ఎవరూ ఊహించని విధంగా, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ స్కూళ్లను బాగు చేస్తున్నామన్నారు. పిల్లలను చదివించడం అనేది తల్లిదండ్రులకు భారం కాకూడదని విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. మనబడి నాడు?నేడు కార్యక్రమం కింద కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. మూడు విడతల్లో నాడు?నేడు పనులను చేపట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3670 కోట్లతో తొలి దశలో స్కూళ్లను ఆధునికీరించామన్నారు. తొలివిడతలో 15,715 స్కూళ్ల రూపురేఖలు మార్చివేశామన్నారు. ఇంగ్లిష్ మీడియం వల్ల తాత్కాలిక ఇబ్బందులు ఉండవచ్చని, అందుకు అనుగుణంగా విద్యాబోధన సాగించేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. నూతన విద్యావిధానంతో పీపీ?1 నుంచి 12వ తరగతి వరకు ఆరు రకాలు స్కూల్స్ తీసుకొస్తున్నామన్నారు. అంగన్‌వాడీ నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రారంభం అవుతుందన్నారు. మూడో తరగతి నుంచి ప్రతి సబ్జెక్ట్‌కు టీచర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ప్రతిపక్ష పార్టీల నేతలు చేస్తున్న విమర్శలను ఎవరూ పట్టించుకోవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలని కోరారు. కోవిడ్ నేపథ్యంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుని స్కూళ్లను తెరుస్తున్నామన్నారు. అనవసర భయాలు వీడాలని, పిల్లలు ఏ మాత్రం అనారోగ్యంగా ఉన్నా ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. నగర మేయర్ మహమ్మద్ వసీం మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరం అన్నారు. స్కూల్ యూనిఫాం గతంలో ప్రైవేట్ స్కూళ్లకే పరిమితమని, కానీ నేడు ప్రభుత్వమే అందజేస్తోందన్నారు. నాడు?నేడు కింద స్కూళ్లలో సకల సౌకర్యాలు తీర్చిదిద్దుతున్నారని అన్నారు. చిన్నారుల భవిష్యత్ కోసం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కమిషనర్ పీవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ.. 30 ఏళ్ల తన సర్వీస్‌లో స్కూళ్లలో ఇలాంటి ఫర్నీచర్ ఎప్పుడూ చూడలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వల్లే ఇది సాధ్యమైందన్నారు. నగరంలో 18 స్కూళ్లలో నాడు?నేడు పనులు చేసినట్లు తెలిపారు. కార్పొరేటర్ చవ్వా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ పేదవాళ్లు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో విద్యను చేరువ చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్య వ్యాపారంగా మారిందన్నారు. విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించారని తెలిపారు. కానీ నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యకు అగ్రతాంబూలం అందిస్తున్నారన్నారు. రెండేళ్లలో విద్య, వైద్య రంగాల్లో గణనీయ మార్పులు వచ్చాయన్నారు. విద్య విలువ తెలిసిన వ్యక్తిగా గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ తెచ్చారన్నారు. ప్రజల నాడి తెలిసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ముందుకెళ్తున్నారన్నారు. కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. తమ ప్రభుత్వంలో పేదవాడికి చదువు భారం కాదని, ఆ భారాన్ని మోయడానికి సీఎం జగన్ సిద్ధంగా ఉన్నారన్నారు. ఇన్నాళ్లూ ప్రైవేట్ స్కూళ్లలో చదువు బాగుంటుందని పంపేవాళ్లని, కానీ రెండేళ్లుగా మార్పు మొదలైందన్నారు. అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు అందిస్తున్నామని తోలిపారు. నాడు?నేడుతో ప్రభుత్వ స్కూళ్లు అద్భుతంగా తీర్చిదిద్దుకున్నాయన్నారు. మంచి ఆలోచనతో సీఎం జగన్ ముందుకు వెళ్తుంటే చివరకు ఇంగ్లిష్ మీడియంను కూడా అడ్డుకునే ప్రయత్నాన్ని బూచి తాత (చంద్రబాబు) చేశారంటూ ఎద్దేవా చేశారు. అందరూ బాగా చదువుకోవాలని కోరారు. తల్లిదండ్రులు ఆస్తులు ఇవ్వకపోయినా చదువు అనే ఆస్తిని జగన్ ఇస్తున్నారు. పేదల ఆర్థిక స్థితిగతులను మార్చేది చదువు మాత్రమేనన్నారు.

## ఎల్‌బ్రస్ శిఖరం అధిరోహించిన తెలుగు యువతి

**సుతాపల్లి దేవి**

భానుగుడి (కాకినాడ సిటీ): యూరప్ దేశాల్లోనే అత్యంత ఎత్తయిన ఎల్‌బ్రస్ శిఖరంపై.. మన స్వాతంత్ర్య దినోత్సవం నాడే మువ్వన్నెల జెండా రెపరెపలాడించి సంచలన రికార్డు నమోదు చేసిందో యువ ట్రెక్కర్. తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన సుతాపల్లి దేవి(23)కి ట్రెక్కింగ్ అంటే అమితాసక్తి. ఆ ఆసక్తితోనే యూరప్ దేశాల్లోనే అత్యంత ఎత్తయిన ఎల్‌బ్రస్ శిఖరాన్ని (5,672 మీటర్లు) కేవలం నాలుగు రోజుల్లో అధిరోహించి.. అక్కడ మన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఔరా! అనిపించింది. ఈ సందర్భంగా ఆమె ‘సాక్షి’తో మాట్లాడుతూ మనకు స్వాతంత్ర్యం వచ్చిన రోజునే ఎల్‌బ్రస్ శిఖరంపై మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం తన జీవితంలో మరచిపోలేని ఆనందక్షణాలని సంతోషం వ్యక్తం చేసింది.



# విద్యార్థిని ,విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేత

## కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు ఆగస్టు 16, ( న్యూస్ పల్స్)( నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జగనన్న విద్యా కానుక క్రింద నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, యూనిఫామ్ లను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ కే.వి.ఎన్. చక్రధర్ బాబు అందజేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం ద్వారా ప్రపంచంలో ఎవరితోనైనా పోటీపడే సామర్థ్యాలను సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర విద్యార్థుల్లో నెలకొల్పుతున్నారు అని అన్నారు. మంచి పౌరులుగా తీర్చిదిద్దుతూ అత్యుత్తమ మానవ వనరుల తయారీయే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నారు అని పేర్కొన్నారు వారి భవిష్యత్తుకు పటిష్ట పునాదులు వేస్తూ, విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు అని పేర్కొన్నారు.ఇందులో భాగంగా 'మనబడి నాడు?నేడు' ద్వారా తొలి విడత కింద రూ.3,669 కోట్లతో సర్వాంగ సుందరంగా 15,715 ప్రభుత్వ స్కూళ్లను ఆధునీకరిస్తున్న వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికార పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, టవళ్లు, పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు ఆగస్టు 16, ( న్యూస్ పల్స్) స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్వతంత్ర పార్కులో ఆయా ప్రాంతాలలో ఉన్నటువంటి 100 మంది నిరుపేదలకు దుప్పట్లు, టవళ్ళు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక బృందావనం ప్రాంతంలో ఉన్న విజేత కంటి వైద్యశాల డాక్టర్ వి. హజరత్ కుమార్, వాయ గుండ్ల ఖాజాశెట్టి చారిటబుల్ ట్రస్ట్ డాక్టర్ కె. విజేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ తోట జనార్ధన్ వారి ధర్మపత్ని తోట కమలాంబ జ్ఞాపకార్థం వారి కుమార్తె అన్నపూర్ణ సౌజన్యంతో నిరుపేదలకు దుప్పట్లు, టవళ్లు, పౌష్టికాహారం ప్యాకెట్లు పంపిణీ చేయడం హర్షణీయం అన్నారు. గౌతమ బుద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు దినదినాభివృద్ధి చెంది మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు అరవ జయ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి అరవ రాయప్ప మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల త్యాగ ఫలమే భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి కారణమని వారందరికీ భారత దేశ ప్రజలు ఎంతో రుణపడి ఉన్నారని స్వాతంత్ర సమరయోధుల సేవలను కొనియాడారు. గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ప్రారంభము నుండి వృద్ధులు, వికలాంగులు, అనాధలు, వితంతు మహిళలతో పాటు ఆసరా కోల్పోయిన మరెంతో మందికి తమ వంతు బాధ్యతగా చేయూత నివ్వడం జరుగుతుందన్నారు.

# దళిత ఆడబిడ్డకు అండగా నిలిస్తే అరెస్ట్ చేస్తారా..

## జాతీయ ప్రధాన కార్యదర్శి ను అరెస్టు చెయడం దారుణం

నందవరం ఆగస్టు 16, ( న్యూస్ పల్స్)( చంపినోడిని అరెస్ట్ చెయ్యకుండా పరామర్శ కి వెళ్లిన జాతీయ ప్రధాన కార్యదర్శి ను అరెస్టు చెయడం దారుణం అని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు దేశాయ్ మాధవరావు , మండల కన్వీనర్ చిన్నరాముడు,ఎల్ఎల్ సి డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి,అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే బీవీ జయనగేశ్వర రెడ్డి అదేశాలమేరకు నందవరం లో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేప్పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నిన్నటి రోజున గుంటూరులో దళిత యువతి రమ్యను నడి రోడ్డు పై కత్తితో పొడిచి అత్యంత పాశవికంగా హత్య చేయడం జరిగిందని. హత్య కాబడిన రమ్య కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళుతున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి గౌ.నారా లోకేష్ గారిని మరియు టిడిపి నాయకులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ, అధికారుల వైఖరి నశించాలి, ప్రజా స్వామ్యాన్ని ఖుని చేస్తున్న ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐపిసి కోడ్ అమలౌతుందో లేదో అర్థం కావడం లేదని .దళితులకు,దళిత మహిళలకు,మహిళలకు రక్షణ ఏది.ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ చట్టం ఎక్కడకు పోయింది. ఈ ప్రభుత్వ పనితీరు ను చూస్తుంటే ఒక నియంత పాలన సాగుతుందనే అర్థమవుతుంది.చంపిన వారిని అరెస్ట్ చేయకుండా, పరామర్శించడానికి వెళ్ళిన వారిని అరెస్టు చేయడం సిగ్గుచేటు.రమ్య కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చి అరెస్టు కాబడిన టిడిపి నాయకులను వేంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు కాశింవలి , రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెద్దరాముడు, మాజీ మార్కెట్ యాడ్ డైరెక్టర్ రామకృష్ణ రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు విశ్వనాథ్,టీడీపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మన్న, గజేంద్ర రెడ్డి, గోపాల్, వీరేష్,ఆదిశేషు, షరీఫ్, జబ్బర్, తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరి పోరుకే అఖిలేష్ మొగ్గు



లక్నో,ఆగస్టు16,(న్యూస్‌పల్స్)ఉత్తర్‌ప్రదేశ్‌రాజకీయాలు వేడెక్కాయి. వచ్చే ఏడాది ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలని సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సైకిల్ యాత్రను ప్రారంభించారు. 2012 ఎన్నికల ఫలితాలు రిపీట్ అవ్వాలన్న లక్ష్యంతో అఖిలేష్ యాదవ్ సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈసారి విజయం తనదేనన్న ధీమాను అఖిలేష్ యాదవ్ వ్యక్తం చేస్తున్నారు.వచ్చే ఏడాది ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 403 స్థానాలున్న ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను సాధించేందుకు అఖిలేష్ యాదవ్ శ్రమిస్తున్నారు. పార్టీలో ఉన్న విభేదాలను క్రమంగా తొలగించుకుంటూ వెళు తూ మరోవైపు క్యాడర్ ను ఉత్తేజ పర్చేందుకు అఖిలేష్ యాదవ్ సైకిల్ యాత్రను ప్రారంభిం చారు. ఈసారి ఒంటరిగానే బరిలోకి దిగనున్నట్లు అఖిలేష్ యాదవ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.గతంలో బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నా పెద్దగా ఫలితం కన్పించకపోవడంతో అఖిలేష్ యాదవ్ఈసారి చిన్నా చితకా పార్టీలను మాత్రం కలుపుకు నేందుకు సిద్ధమయ్యారు. 2017లో జరిగిన ఎన్నికల్లో సమాజ్ వాదీ పార్టీకి కేవలం 47 స్థానాలు మాత్రమే దక్కాయి. మ్యాజిక్ ఫిగర్ 202 కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందు కు అఖిలేష్ యాదవ్ నడుంబిగించారు. బీజేపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకునేందుకు ఆయన తీవ్రంగా శ్రమిస్తు న్నారు.కాంగ్రెస్ తో కలసి గత ఎన్నికల్లో చతికల పడిన అఖిలేష్ యాదవ్ ఈసారి ఆ తప్పు చేయదలచుకోలేదు. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారీగా బలమైన అభ్యర్థులను ఎంపిక చేసే దిశగా కసరత్తు చేస్తున్నారు. అసంతృప్తులను బుజ్జగిస్తూ ఇప్పటి నుంచే అఖిలేష్ యాదవ్ యుద్ధానికి సిద్ధమవుతున్నారు. మాయావతి పార్టీ ఎఫెక్ట్ తమ పై పడకుండా ఈసారి అఖిలేష్ యాదవ్ అన్ని రకాలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరి ఉత్తర్ ప్రదేశ్ లో ఈసారి సైకిల్ పరుగులు తీస్తుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# కాశీబుగ్గలో మంత్రి సిదిరి అప్పలరాజు పర్యటన

పలాస ఆగస్టు 16, ( న్యూస్ పల్స్) నాడు నేడులో భాగంగా మంచి భవనాలు, రంగురంగుల బొమ్మలు, అధునాతన ఫర్నిచర్ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులున్న తీరు క్రమశిక్షణకు నిదర్శనం అన్నారు. మనబడి నాడు-నేడు మొదటి దశ జాతికి అంకితం అనే కార్యక్రమం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ఏర్పాటు చేసిన సభలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, వంటగది, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల కోట్ల రూపాయలతో 56 వేల పాఠశాలలు ఆధునికీకరణ చేసేందుకు ప్రణాళికలు తయారు చేయగా, మొదటి దశలో రూ. 3600 కోట్ల రూపాయలతో పూర్తి చేశామన్నారు. జగనన్న ఏది చెబితే అది తప్పక చేస్తారని కితాబునిచ్చారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తయారయ్యాయని, ఇప్పుడు ఏ పాఠశాలలు మూతబడతాయో చూద్దామన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా మొట్టమొదట ఆంధ్రరాష్ట్రంలో అడుగులు వేసింది అన్నారు. తాను ఇటువంటి పాఠశాలలో చదువుకోలేకపోయానని, మిమ్మల్ని చూస్తే అసూయగా ఉందా అంటూ సరదాగా చిన్నారులతో వ్యాఖ్యానించారు. ఇకపై ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన కొనసాగుతుందని, పాఠశాలలను 6 కేటగిరీలుగా విభజించారని వివరించారు. అంగన్వాడీ కేంద్రాలను శాటిలేషన్ ఫౌండేషన్ స్కూల్స్ గా మార్పు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు పాఠశాలను బాగు చేసే ఆలోచన చరిత్రలో ఏ నాయకుడికి రాలేదని, భావితరాలకు ఇచ్చే ఆస్తి ... నాణ్యమైన విద్య అని జగన్ మోహన్ రెడ్డి తమతో ఎప్పుడూ చెబుతూ ఉంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్, తాసిల్దార్ మధుసూదన్, ఎంపీడీవో రమేష్ నాయుడు, ఎంఈఓ శ్రీనివాసరావు, మెప్మా పిడి కిరణ్ కుమార్, ఎస్ఎంసి చైర్మన్ ఫ్రాన్సిస్ తో పాటు పలువురు కౌన్సిలర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రహదారి సౌకర్యం కల్పించండి

## గిరిజనుల ఆవేదన

విశాఖపట్నం అరకులోయ నియోజకవర్గం అనంతగిరి మండలం లోని రొంపలి పంచాయతీ పసిని గ్రామంలోని స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశబ్దాలు గడుస్తున్నా ఇప్పటి వరకు రోడ్డు సాదుపాయం లేక నానా అవస్థలు పడుతున్నారు అయినప్పటికీ అధికారులకు ప్రజాప్రతినిధులు కన్పించడం లేదు జీవన స్థితి దుర్భరంగా ఉంది సుమారు ఐదు కిలోమీటర్లు కలినడక వెళ్లే దారిలో నే ద్విచక్ర వాహనంపై విన్యాసాలు చేసుకుంటూ ప్రయాణం చేస్తుంటారు తాటిపూడి సమీపంలో గల పాత పన్నాల్ పాడు నుండి పసిని వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎన్నో మార్లు గ్రామసభల వచ్చిన అధికారులకు ఫిర్యాదులు వినతులు ఇచ్చిన పరిస్కారం కాలేదు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు పొందలేక ప్రాణాలు కోల్పోయారు గిరిజనులు పండించిన పంటలు కూరగాయలు సంతకు తీసుకువెళ్లి విక్రయించాలన రోడ్డు సౌకర్యం లేక కూరగాయలు పాడైపోయిన సందర్భాలు అనేకం విశాఖ ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో కనీస రహదారి సౌకర్యం లేకపోవడం బాధాకరం అంబులెన్స్ వాహనాలు వెళ్లడానికి శాపంగా మారింది కొద్దిపాటి వర్షం కురిసిన భవ్యప్రపంచని వెళ్లలేని దుస్థితి ఏర్పడుతుంద ఆయా గ్రామాలు గిరిజనులు బాధ వ్యక్తపరిచారు

# ఎట్టకేలకు పాన్ ఇండియాని టార్గెట్ చేయబోతున్న మహేష్..!



టాలీవుడ్ హీరోలందరూ ఇప్పుడు తమ మార్కెట్ ని విస్తరించుకునే పనిలో ఉన్నారు. తమ సినిమాలను కేవలం తెలుగుకే పరిమితం చేయకుండా.. ఇతర భాషల్లో కూడా విడుదల చేసి వరల్డ్ వైడ్ క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తున్నారు. ఇమేజ్ తో సంబంధం లేకుండా ప్రతి హీరో కూడా మల్టీలాంగ్వేజ్ సినిమాలు చేస్తూ పాన్ ఇండియా స్టార్ అనిపించుకోవాలని ఆశ పడుతున్నాడు. ఇప్పటికే పలువురు స్టార్ హీరోలు ఈ ప్రయత్నాల్లో సక్సెస్ అయ్యారు. అయితే సూపర్ స్టార్ మహేష్ బాబు మాత్రం ఇంతవరకు పాన్ ఇండియా మూవీ చేయడానికి ట్రై చేయలేదు.టాలీవుడ్ టాప్ హీరోల్లో ఒకరైన మహేష్ బాబు క్రేజ్ గురించి ఫ్యాన్ ఫాలోయింగ్ స్టార్డమ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. హాలీవుడ్ హీరో కటౌట్ తో ఉండే సూపర్ స్టార్.. ఇప్పటి వరకు తెలుగు సినిమాలకు మాత్రమే పరిమితం అయ్యారు. అయితే పాన్ ఇండియా మూవీ చేయకుండానే నేషనల్ వైడ్ పాపులారిటీ తెచ్చుకున్నారు మహేష్. అదే మల్టీ లాంగ్వేజ్ సినిమా చేస్తే మహేష్ రేంజ్ ఎక్కడికో వెళ్లిపోతుందని సినీ అభిమానులు భావిస్తుంటారు. 'స్పైడర్' సినిమాతో తమిళ్ లో అడుగుపెట్టాడు కానీ.. పాన్ ఇండియా వైడ్ ఆలోచనలు మాత్రం చేయలేదు.అయితే దర్శక ధీరుడు రాజమౌళి తో మహేష్ బాబు చేసే సినిమా పక్కా పాన్ ఇండియా ప్రాజెక్ట్ అవుతుందనే విషయం మీద అందరికీ క్లారిటీ ఉంది. ఇప్పుడు దాని కంటే ముందే సూపర్ స్టార్ మల్టీ లాంగ్వేజ్ మూవీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. 'సర్కారు వారి పాట' సినిమా తర్వాత త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేష్ ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాతో పాన్ ఇండియాని టార్గెట్ చేయబోతున్నారని సమాచారం.ఇటీవల నిర్మాత సూర్యదేవర నాగవంశీ సైతం చూూ:28 పాన్ ఇండియా ప్రాజెక్ట్ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. మహేష్ - త్రివిక్రమ్ కాంబోలో వచ్చేది యాక్షన్ జోనర్ మూవీ అని.. ఇది పాన్ ఇండియా అప్పీల్ ఉన్న స్టోరీ అని.. పరిస్థితులను బట్టి పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేసే ఆలోచన చేస్తామని నిర్మాత తెలిపారు. రాబోయే రోజుల్లో దీనిపై క్లారిటీ రానుంది.చూూ:28 చిత్రంలో మహేష్ బాబు సరసన పూజా హెగ్డే హీరోయిన్ గా నటించనుంది. ఎస్.ఎస్.థమన్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చనున్నారు. మది సినిమాటోగ్రాఫర్ గా.. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరించనున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్ వర్క్ చేయనున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. నవంబర్ నుంచి ఈ చిత్రాన్ని సెట్స్ మీదకు తీసుకెళ్తారని టాక్ వినిపిస్తోంది.

# విడాకులు తీసుకున్న మోస్ట్ కన్ఫ్యూజ్డ్ పర్సన్..!

'మళ్ళీరావా' తర్వాత ఆ స్థాయి సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న అక్కినేని హీరో సుమంత్.. ఇప్పుడు "మళ్ళీ మొదలైంది" అనే సినిమాతో వస్తున్నాడు. సుమంత్ రెండో పెళ్లి వార్తలతో కావాల్సినంత పబ్లిసిటీ తెచ్చుకున్న ఈ చిత్రాన్ని ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా విడాకుల తర్వాత జీవితాన్ని చూపించబోతున్నామని చెప్పి సినిమాపై ఆసక్తిని కలిగించారు. ఈ క్రమంలో ఇందులోని పాత్రలను ఒక్కొక్కటిగా పరిచయ చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా హీరో సుమంత్ లుక్ ని సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు.'మళ్ళీ మొదలైంది' చిత్రంలో సుమంత్ కుమార్ అనే యువకుడిగా సుమంత్ నటిస్తున్నారు. ఇందులో గడ్డంతో గ్రీన్ టీ షర్ట్ లో ఉన్న సుమంత్.. క్లాస్ గా కనిపిస్తున్నాడు. విడాకులు తీసుకున్న మోస్ట్ కన్ఫ్యూజ్డ్ పర్సన్ గా ఈ చిత్రంలో హీరో కనిపించనున్నారని మేకర్స్ తెలిపారు. ఒంటరిగా ఉండటానికి ఇష్టపడే సుమంత్.. వంట బాగా చేస్తాడని ఈ పోస్టర్ ద్వారా వెల్లడించారు. రొమాంటిక్ కామెడీ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతోన్న ఈ సినిమా అక్కినేని హీరోకి సాలిడ్ హిట్ అందిస్తుందేమో చూడాలి.ఇకపోతే 'మళ్ళీ మొదలైంది' మూవీలో సుమంత్ సరసన నైనా గంగూలీ హీరోయిన్ గా నటిస్తోంది. సుహాసిని మణిరత్నం - మంజుల ఘట్టమనేని - వెన్నెల కిషోర్ - పోసాని కృష్ణ మురళి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజీ కీర్తి కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రెడ్ సినిమాస్ చరణ్ తేజ్ సమర్పణలో కె. రాజశేఖర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.తెలుగులో ఇప్పటి వరకు చూడని సరికొత్త కథాంశంతో 'మళ్ళీ మొదలైంది' సినిమా తెరకెక్కుతోందని మేకర్స్ చెబుతున్నారు. అనుప్ రూబెన్స్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. కృష్ణ చైతన్య పాటలు రాస్తున్నారు. శివ జీఆర్ఎన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. ప్రదీప్ రాఘవ్ ఎడిటింగ్ చేస్తున్నారు. అర్జున్ సురిశెట్టి ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయనున్నారు.




# ఆ విషయంలో నా సొంత నిర్ణయం

అందం ప్లస్ అభినయం ఉన్న నటిగా తొలి చిత్రంతోనే మంచి పేరు తెచ్చుకుంది మేఘా ఆకాశ్. నితిన్ హీరోగా వచ్చిన 'లై' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఆ తర్వాత సినిమా కూడా నితిన్ తోనే చేసింది. 'బొమ్మొలె ఉన్నదిరో పోరి' అనే సాంగ్లో తన స్టెప్పో యూత్ను ఆకట్టుకుంది ఈ భామ. 'ఛల్ మోహన్ రంగ' చిత్రంలో మేఘ యాక్టింగ్ చాలా బాగుందనే ప్రశంసలు అందుకుంది. ఈ సినిమాను పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రొడ్యూస్ చేయగా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కథ అందించారు.ఇకపోతే ఆ తర్వాత పలు సినిమాల్లో నటించినప్పటికీ అవి తెలుగు సినిమాలు కాదు. తమిళ్ భాషలోనే పలు సినిమాల్లో యాక్ట్ చేసింది మేఘా ఆకాశ్. కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్షన్లో తమిళ్ తలైవా సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా వచ్చిన 'పేటా' చిత్రంలో కీ రోల్ ప్లే చేసింద మేఘా ఆకాశ్. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి కూడా కీలక పాత్ర పోషించాడు. ఇక ఈ అమ్మాయి కట్టు బొట్టు ముఖం చూస్తే తమిళ్ అమ్మాయిలా ఉండదు. అచ్చం తెలుగమ్మాయి మాదిరిగానే కనబడుతుంది ఈ భామ.ఈ హీరోయిన్ 'రాజరాజ చోర' చిత్రంతో మళ్లీ తెలుగు ప్రేక్షకులను పలకరించబోతున్నది. ఈ నెల 19న ఈ సినిమా విడుదల కాబోతుండగా మీడియాతో ముచ్చటించింది. ఈ క్రమంలోనే ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది ఈ భామ. తెలుగు తెరపై కనిపించకపోవడానికి కారణం సరైన కథలు దొరకకపోవడమేనని తెలిపింది. తమిళ్లో డిఫరెంట్ కాన్సెప్ట్ స్టోరీస్ చాలా వస్తున్నాయని ఈ నేపథ్యంలోనే ఆయా సినిమాల్లో భాగమవుతున్నానని చెప్పింది. శ్రీవిష్ణు హీరోగా వస్తున్న 'రాజరాజచోర'మూవీలో సంజన అనే పాత్ర పోషించినట్లు మేఘ తెలిపింది.అందంతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్ర తనది అని చెప్పింది. తన సినిమాల సెలక్షన్ విషయమై ఎవరితోనూ డిస్కస్ చేయబోనని పేరెంట్స్ నుంచి ఎటువంటి సజెషన్స్ తీసుకోబోనని పేర్కొంది. ఈ చిత్రంతో పాటు తెలుగులో 'డియర్ మేఘ గుర్తుందా శీతాకాలంమనుచరిత్ర' చిత్రాల్లో మేఘా ఆకాశ్ నటిస్తోంది. ఇక తమిళ్లో మేఘా ఆకాశ్ 'అక్టోబర్ థర్టీ ఫస్ట్ లేడీస్ నైట్ యాధుమ్ ఊరె యావరుమ్ కియర్' చిత్రాల్లో ఫిమేల్ లీడ్ రోల్ ప్లే చేస్తోంది.



# క్రికెటర్ల పరిస్థితి.. ఐపీఎల్‌లో ఆడతారా?



గతంలో ఆఫ్ఘనిస్థాన్ దేశం తాలిబన్ల నుంచి స్వేచ్ఛా వాయువులు పీల్చడంతోపాటు అక్కడి క్రికెట్ కూడా ఎంతో పురోగతి సాధించింది. ఈ క్రమంలో ఆ దేశం నుంచి నుంచి రషీద్ ఖాన్ లాంటి ఆటగాడు ప్రపంచ స్థాయి స్పిన్ బౌలర్ గా ఎదిగి అంతర్జాతీయ క్రికెట్‌లో సంచలనాలు సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం ఆ దేశం మళ్లీ తాలిబన్ల చేతుల్లోకి వెళ్లిపోవడంతో అక్కడి క్రికెటర్ల భవిష్యత్తు గందరగోళంలో పడింది. స్టార్ క్రికెటర్లు రషీద్ ఖాన్, మహ్మద్ నబీలాంటి టగాళ్ళు వచ్చే నెలలో జరిగే ఐపీఎల్‌లో ఆడతారా లేదా అనేది తాజాగా జరుగుతున్న పరిణామాల దృష్ట్యా అనుమానంగా మారిందనే చెప్పాలి.ప్రస్తుతం వీరిద్దరూ ఆఫ్ఘనిస్థాన్‌లో లేరు. హండ్రెడ్ టోర్నీలో ఆడటం కోసం యూకేలో ఉన్నారు. రషీద్ ట్రెంట్ రాకెట్స్‌కు, నబీ లండన్ స్పిరిట్స్‌కు ఆడుతున్నారు. అయితే వీళ్లు అక్కడి నుంచి నేరుగా యూఏఈ వచ్చి ఐపీఎల్‌లో పాల్గొంటారా లేదా అనేదానిపై ఇంకా ఏటువంటి స్పష్టత లేదు. మరో పక్క వాళ్లు వస్తారన్న నమ్మకం తమకు ఉన్నదని బీసీసీఐ చెబుతోంది. కాకపోతే ఇప్పుడే దీనిపై కచ్చితంగా ఏమి చెప్పలేము, తాజా పరిస్థితులను గమనిస్తున్నట్లు పేర్కొంది.యుకే లో టోర్నీ ముగిశాక కూడా రషీద్, నబీ అక్కడే వుంటే మన వాళ్లతో కలిపి ఒకే విమానంలో తీసుకువచ్చే ప్రయత్నం బీసీసీఐ చేయాలని భావిస్తోంది. రషీద్, నబీ ఇద్దరూ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌కు ఆడుతున్న సంగతి తెలిసిందే. ఆఫ్ఘనిస్థాన్‌లో పరిస్థితిపై అక్కడి క్రికెట్ బోర్డుతో బీసీసీఐ మాట్లాడుతామని తెలిపింది. ఇప్పటికే తమ దేశాన్ని రక్షించాలంటూ రషీద్ ఖాన్ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే.

## 20 పరుగులకే ఔట్.. డ్రెస్సింగ్ రూమ్‌లో టవల్ విసిరి కొట్టిన కోహ్లి, వైరల్

లండన్: లార్డ్స్ టెస్టు 4వ రోజు విరాట్ కోహ్లీ 20 పరుగులకే వెనుదిరిగాడు. అయితే దీనిపై కోహ్లీ తన నిరాశను ప్రదర్శిస్తూ డ్రెస్సింగ్ రూమ్‌లో టవల్‌ను విసిరినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. దీనిపై కొంత మంది నెటిజన్లు కోహ్లీకి మద్దతుగా నిలుస్తుండగా.. మరికొందరు ట్రోల్ చేస్తూ కామెంట్ చేస్తున్నారు. కోహ్లీ వరుసగా ఏడు ఇన్నింగ్స్‌లలో యాభై పరుగులు కూడా చేయకుండానే వెనుదిరిగాడు. ఇక కోహ్లీ స్కోర్లు వరుసగా 0, 62, 27, 0, 44,13, 0, 42, 20 గా ఉన్నాయి. దీనిపై ఓ అభిమాని స్పందిస్తూ.. "కోహ్లీ! ఎంత సమయమైన తీసుకో.. కానీ మళ్లీ నీ ప్రతాపం చూడాలి. నీ ఆటతో విమర్శించే వాళ్ల నోళ్లు మూయించాలి. దాని కోసం నేను వేచి ఉంటాను." అంటూ తన అభిమానాన్ని చాటుకున్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**